భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో హోమాన్ని విశేషంగా జరిపారు. ఉభయకర్తగా పంచాఘ్నుల పవన్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

కనులపండువగా ఊంజల్‌సేవ



నెల్లూరు(బృందావనం): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి లలితా సహస్రనామం, ఖడ్గమాల, ఊంజల్‌సేవను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో అవ్వారి వెంకటరామకృష్ణశర్మ, నరసింహ, దిలీప్ చేపట్టారు. ఉభయకర్తలుగా నల్లగండ్ల మధు, నాగవర్ధినీశ్వరి దంపతులు వ్యవహరించారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ జయరామ్, సభ్యులు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

వేడుకగా పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవస్థాన ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, సభ్యుడు శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాఖీ శుభాకాంక్షలు



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ రక్షాబంధన్ శుభాకాంక్షలను తెలియజేశారు. జెడ్పీ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆయనకు రాఖీ కట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

హోరాహోరీగా ఆటల పోటీలు

కావలి: విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) పేరు మీద విశ్వోదయ డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న డాక్టర్ డీఆర్ బాలల దినోత్సవం– 2023 క్రీడాపోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తల పడుతున్నారు. బుధవారం వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఆటల్లో విద్యార్థులు ఆద్యంతం ఉత్కంఠంగా సాగిస్తున్నారు. కావలి నియోజకవర్గంలోని కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలతో పాటు కావలిటౌన్ నుంచి 50 పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అయితే మధ్యాహ్నం నుంచి ఆకస్మికంగా కురిసిన వర్షానికి పలు ఈవెంట్స్ 1వ తేదీకి వాయిదా పడ్డాయి. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌చార్జి మాల్యాద్రి, పీడీ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి.

ఏఎస్‌పేటలో త్వరలో సహకార బ్యాంక్

అనుమసముద్రంపేట: ప్రముఖ యాత్ర స్థలం ఏఎస్‌పేటలో సెప్టెంబర్‌లో సహకారం బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంకర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఏఎస్‌పేట బ్రాంచ్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. లాకరు గది, స్ట్రాంగ్‌రూం, మేనేజర్ రూంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ పరిధిలో ఇటీవల మంజూరైన బ్రాంచ్‌లోల మొదట ఏఎస్‌పేట బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బ్యాంక్‌లో పనులు పూర్తి కావచ్చాయని, సెప్టెంబర్‌లో ప్రారంభిస్తామన్నారు. తక్కువ అద్దెతో లాకర్ సౌకర్యం కల్పిస్తామన్నారు. నూతన బ్రాంచ్ మేనేజర్‌గా అపాయింట్ అయిన సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలోని గ్రామాల్లో రైతులకు ప్రజలకు తమ బ్రాంచ్ సేవలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రైతులకు విరివిగా పంట రుణాలు అందజేస్తామన్నారు. రైతులు తమ బ్యాంకులో అకౌంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజవోలు సొసైటీ అధ్యక్షుడు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపాలి



ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపి ప్రతిభతో క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించాలని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 25 జతల క్రీడా దుస్తులను ఆయన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా ఏటా ఆయన పుట్టిన రోజును క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. మూడు ఒలంపిక్ పతకాలు సాధించిన ధ్యాన్‌చంద్‌ను దేశంలోని ప్రతి క్రీడాకారుడు స్ఫూర్తిగా తీసుకుని స్వయంశక్తితో ఎదగాలన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో తాను సైతం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, హెచ్‌ఎం కోటేశ్వరి, సయ్యద్ జమీర్ బాషా, మల్లిక ఇందిరమ్మ, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కృష్ణాష్టమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నగరంలో సెప్టెంబర్ ఆరు నుంచి 12 వరకు నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నిర్వాహకులు బుధవారం ఆహ్వానించారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. నెల్లూరు శాఖ అధ్యక్షుడు సురమౌళి, రత్నం, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయరూ..



నెల్లూరు(క్రైమ్): మందుబాబులు తమపై దాడులకు పాల్పడుతున్నారని.. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ రామారావుకు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించిన అనంతరం వారు మాట్లాడారు. దుకాణాల బయట మద్యం తాగొద్దని సూచించినా.. గొడవలు పడొద్దని కోరినా తమపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు.

భూమిని ఇప్పించాలి

నెల్లూరు(మినీబైపాస్): తమ భూమిని ఇప్పించడంతో పాటు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తగు చర్యలు చేపట్టాలని మూలె బాలకృష్ణారెడ్డి, కొండా వాసవి, హరిత కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. గతంలో కొనుగోలు చేసిన భూమిని రిజిస్టర్ చేయాల్సి ఉందని, ఈ విషయమై దొడ్డంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వివాహ వేడుకలకు ఎమ్మెల్యే మేకపాటి



నెల్లూరు(దర్గామిట్ట): ఏఎస్‌పేట మండలం రాజవోలుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ముంగమూరు సుఖేష్‌రెడ్డి, మాలిని దంపతుల కుమారుడు రామ్‌కౌశిక్ వివాహానికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి పలువురు హాజరయ్యారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన



నెల్లూరు సిటీ: రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కార్డు ప్రైమ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ కార్యాలయ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ పెన్ డౌన్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడారు. ఈ విధానం డాక్యుమెంట్ రైటర్లకు అన్యాయం జరిగేలా ఉందని తెలిపారు. పెన్‌డౌన్ కార్యక్రమం గురువారం సైతం కొనసాగనుందని చెప్పారు.

కళాకారుడికి సన్మానం



నెల్లూరు(బృందావనం): సినీ నటుడు అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను నగరంలోని కాపువీధిలో నాగార్జున కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి అంజద్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి మిఠాయిలను అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుడు దోస్త్‌బాషాను సత్కరించారు. బుల్లితెర నటుడు మురళీమోహన్‌రావు, అమానుల్లాఖాన్, మల్లికార్జున, ఇంతియాజ్, మూర్తి, ఆరిఫ్, ఆలమ్, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహ కొండపై వెలసిన వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నూతన బలిపీఠ స్థాపన విశేష పూజలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

ఆత్మకూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నట్లు, మృతులు, డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్లను తొలగిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ తెలిపారు. ఆత్మకూరులో బుధవారం ఆయన తహసీల్దారు లక్ష్మీనరసింహం, బీఎల్‌ఓలతో కలిసి జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి ఓటర్ల జాబితాను సరి చేసుకోవడంతో పాటు మృతుల వివరాలను వారికి తెలిపి ఆ ఇళ్ల వారి సంతకం తీసుకుని జాబితాల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం తెలియజేస్తున్నామన్నారు. బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా పరిశీలన బాధ్యతగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ అన్నారు. ఆత్మకూరులో 6,385 ఓటర్ల తొలగింపులు ఉన్నాయని, వాటిని చట్టప్రకారమే తొలగించామన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం బీసీ కాలనీకి చెందిన షేక్ మీరమ్మ (75) సోమవారం రాత్రి విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. వర్షం పడుతుండడంతో ఆరుబయట ఉన్న విద్యుత్ మోటార్‌పై రేకు పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు గుర్తించి గండిపాళెం పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ఈ మేరకు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

జీజీఎంపీ పనులను పూర్తి చేయాలి

కొడవలూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం '(జీజీఎంపీ)లో మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీజీఎంపీ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నందున పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ కమిటీలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు విధిగా ఉండాలని చెప్పారు. మండలంలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్‌లను వచ్చే నెల 4వ తేదీన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పీఆర్ ఏఈ తాతారావు, డీటీ గున్నం మల్లికార్జున, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఆడిట్‌పై అవగాహన ఉండాలి

కొడవలూరు : పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ ఆడిట్‌పై అవగాహన కలిగి ఉండాలని లోకల్ ఫండ్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ హరికృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఆన్‌లైన్ ఆడిట్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, కుళాయి పన్నులపైనే కాకుండా యాడ్లు, ఇంటి నిర్మాణ ప్లాన్‌లపై కూడా ఆన్‌లైన్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల వీటిపై కూడా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తద్వారా పంచాయతీల రాబడి గణనీయంగా పెంచుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ ఆడిట్‌లో పంచాయతీల రాబడికి సంబంధించిన అన్ని అంశాలపైనా ఆడిట్ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఆడిట్ అధికారి కవిత, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, డి.సురేష్‌కుమార్, ఎస్కే.షబ్బీర్, ఎం.బ్రహ్మనందరెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో మిథిలేష్ ప్రతిభ

ముత్తుకూరు : అంతర్జాతీయ చెస్ పోటీలో గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్ ఆరో తరగతి విద్యార్థి పి.మిథిలేష్‌కు ద్వితీయ బహుమతి లభించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజులు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ చెప్పారు. బహుమతితో పాటు రూ.9,000ల నగదు, జ్ఞాపికను బహూకరించారని ప్రిన్సిపల్ బుధవారం తెలిపారు.

చిన్నారులకు ఆపన్నహస్తం



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డు వవ్వేరు గ్రామంలో తల్లి, తండ్రులను కోల్పోయిన పలువురు చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. వవ్వేరు గ్రామానికి చెందిన ఆర్.శ్యామల, ఆర్.అభిరామ్, నాగ చైతన్య, నాగప్రసన్నలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.20 వేల చొప్పున మొత్తం రూ.80 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించారు. ఆ బాండ్లను బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అందజేశారు.

రూ.2.39 కోట్ల రుణాల మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దాదాపు 471 మందికి స్త్రీనిధి ద్వారా రూ.2.39 కోట్లను మంజూరు చేశారు. ఈ మేరకు నమూనా చెక్కును ఎమ్మెల్యే ప్రసన్న అందజేశారు. తహసీల్దార్ సుధీర్, ఏపీఎం లలితా, పార్టీ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావన్, మురళీ, వెంకయ్య, ఆదిశేషయ్య, పెంచలయ్య, మురళీ, వెంకటరమణారెడ్డి, అల్లాభక్షు, భరత్, డాక్టర్ అల్లాభక్షు, బాలకృష్ణ, శివ, నాగసుబ్బారెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నెల్లూరు రూరల్: మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలు సంభవిస్తాయని ఎస్‌ఈబీ – 2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సును సౌత్‌మోపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూల్, వెల్లంటి జెడ్పీ హైస్కూళ్లలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారమిచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచి వీటిని నిర్మూలిస్తామని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారమివ్వాలని కోరారు. ఎస్‌ఈబీ ఎస్సై శకుంతలాదేవి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కొండయ్య, వైద్యాధికారి రవీంద్ర, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరంలోని 12వ డివిజన్లో గల రెండు, మూడు వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రిజిస్టర్, నోటీస్ బోర్డు, స్పందన రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. పన్నులను గడువులోపు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మదా, మురళి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందించాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జేఈఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ల వైద్యాధికారులతో సమావేశాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహావిష్కరణ



ఎమ్మెల్యే అనిల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునర్నిర్మించిన బుద్ధుడి విగ్రహాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అసోసియేషన్ నేతలు సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ రాయప్ప, ప్రధాన కార్యదర్శి రమణయ్య, ట్రెజరర్ పళణి, గౌరవాధ్యక్షుడు రాచపాళెం రఘు, కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, బలరామనాయుడు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రత్నం' విద్యార్థులకు ఎస్పీ అభినందన



నెల్లూరు(క్రైమ్): తిరుపతిలోని మహిళా యూనివర్సిటీ మైదానంలో ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ సిలాట్ లీగ్‌లో రజత, కాంస్య పతకాలను సాధించిన డాక్టర్ కిషోర్స్ రోహిణి రత్నం హైస్కూల్ పదో తరగతి విద్యార్థినులు నిఖిల, మాధురిసింగ్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తన చాంబర్‌లో బుధవారం అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణకిశోర్, వాసంతికిశోర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, పెన్‌కాక్ సిలాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరద్వాజ్, ప్రిన్సిపల్ మణిమాల, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు రూరల్: బాలల హక్కులపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దేవరపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. బాలల హక్కులపై న్యాయసాయం పొందాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించొచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



నెల్లూరు(పొగతోట): వారణాశిలో ప్రమాదవశాత్తూ మరణించిన ఈఓపీఆర్డీ నాగరాజు కుటుంబీకులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరామర్శించారు. నాగరాజు ఇంటికెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడి సానుభూతిని తెలియజేశారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. లేక్‌వ్యూ కాలనీలోని 12వ వీధిలో ఓ ఇంటిని మహేశ్వరి, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచార కేంద్రాన్ని నిర్వహించసాగారు. ఈ విషయమై దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఎస్సై సుబ్రహ్మణ్యం, సిబ్బందితో కలిసి ఇంటిపై మంగళవారం దాడి చేశారు. నిర్వాహకులను అరెస్ట్ చేసి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. మహిళల కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.